
సాక్షి
అనకాపల్లి
సోమవారం । 29 । సెప్టెంబర్ । 2025



న్యూస్‌రీల్

మహాచండీదేవిగా జగజ్జనని



నర్సీపట్నంలో మహాచండీదేవిగా దుర్గమ్మ

నర్సీపట్నం: శరన్నవరాత్రి మహోత్సవాలను పురస్కరించుకొని అమ్మవారికి ప్రత్యేక పూజలను నిర్వహిస్తున్నారు. విశేషాలంకారాల్లో కొలువైన జగజ్జనని భక్తులు దర్శించుకుంటున్నారు. పట్టణంలో శ్రీదుర్గామల్లేశ్వర స్వామి ఆలయం, బలిఘట్టం దేవాలయాల్లో ఏడో రోజు ఆదివారం అమ్మవారు మహాచండీదేవి అలంకరణలో భక్తులకు దర్శనమిచ్చారు. అమ్మవారికి ప్రత్యేక పూజలు, సామూహిక కుంకుమార్చనలు నిర్వహించారు.

స్టీల్‌ప్లాంట్ ఈవోఐల రద్దుకు నేడు పోరాట కమిటీ ధర్నా

ఉక్కునగరం: ఉక్కు పరిరక్షణ పోరాట కమిటీ ఆధ్వర్యంలో సోమవారం అడ్మిన్ కూడలి వద్ద ధర్నా చేయనున్నారు. స్టీల్‌ప్లాంట్ ప్రైవేటీకరణ ఆపాలంటూ పోరాట కమిటీ ఆధ్వర్యంలో ఆందోళన చేస్తున్నారు. ఇదే సమయంలో ఉక్కు యాజమాన్యం 44 విభాగాల్లో ఈవోఐల కోసం నోటిఫికేషన్ చేసింది. యాజమాన్యం వైఖరికి నిరసనగా ఉదయం 8 గంటల నుంచి 12 గంటల వరకు నిర్వహించనున్న ధర్నాలో అన్ని కార్మిక సంఘాల నాయకులు, కార్యకర్తలు, అభిమానులు, సానుభూతిపరులు అధిక సంఖ్యలో హాజరై యాజమాన్యానికి తమ వైఖరిని తెలియజేయాలంటూ పోరాట కమిటీ నాయకులు జె. అయోధ్యరామ్, డి. ఆదినారాయణ, మంత్రి రాజశేఖర్ కోరారు.

ధర్నాకు అనుమతి లేదు

ఉక్కు పరిరక్షణ పోరాట కమిటీ ఆధ్వర్యంలో సోమవారం తలపెట్టిన ధర్నాకు పోలీసు అనుమతి లేదని స్టీల్‌ప్లాంట్ సీఐ కేశవరావు తెలిపారు. ధర్నా చేయాలనుకుంటే జీవీఎంసీ ఎదురుగా ఉన్న గాంధీ విగ్రహం వద్ద చేసుకోవాలి తప్ప ఉక్కు అడ్మిన్ బిల్డింగ్ వద్ద అనుమతించబోమన్నారు. అనుమతి లేని చోట ధర్నా చేస్తే చట్టరీత్యా చర్యలు తీసుకుంటామన్నారు. శాంత భద్రతల దృష్ట్యా పోలీసు శాఖకు సహకరించాలని ఆయన కోరారు.

రంగురాళ్ల క్వారీల్లో అక్రమార్కుల స్వారీ

రెండు బేస్ క్యాంపులున్నా కొరవడిన నిఘా | చుట్టం చూపుగా వచ్చి పోతున్న ఫారెస్ట్ సిబ్బంది

నర్సీపట్నం: క్వారీల్లో విలువైన రంగురాళ్లు.. వాటి కోసం రహస్యంగా తవ్వకాలు.. వారిని కట్టడి చేయడానికి రెండు బేస్ క్యాంపులు.. అటవీ సిబ్బంది నిఘా లేక వృథా ప్రయత్నాలు.. ఇదీ నర్సీపట్నం నియోజకవర్గంలోని రంగురాళ్ల క్వారీల పరిస్థితి.. వర్షాకాలం కావడంతో తవ్వకాలకు అనుకూలంగా ఉంటుంది. దసరా రోజుల్లో అందరూ పండగ హడావుడిలో ఉంటారన్న ఉద్దేశంతో రంగురాళ్ల వేట మొదలవుతోంది. ఇలాంటి సమయంలో నిఘాను మరింత కట్టుదిట్టం చేయాల్సిన అటవీ శాఖ అధికారులు ఉదాసీనంగా వ్యవహరిస్తున్నారు. బేస్ క్యాంపుల వద్ద అటవీ సిబ్బంది కానరావటం లేదు. అటవీ అధికారులు నిర్లక్ష్యంగా వ్యవహరించినప్పుడల్లా రంగురాళ్ల వ్యాపారులు విజృంభించడం పరిపాటిగా మారింది. గొలుగొండ మండలంలో కరక, ఆరిల్లోవ అటవీ ప్రాంతాల్లో రంగురాళ్ల క్వారీలు ఉన్నాయి. ఈ క్వారీల వద్ద పేరుకు మాత్రం బేస్ క్యాంపులు ఉన్నాయి. ఈ క్యాంపుల వద్ద రాత్రింబవళ్లు సిబ్బంది కాపలా ఉండాలి. ప్రతి బేస్ క్యాంప్ వద్ద ఐదుగురు సిబ్బంది విధి నిర్వహణలో ఉండాలి. కానీ బేస్ క్యాంపుల వద్ద కనీసం ఒక్కరు కూడా కానరాలేదు. సిబ్బంది మధ్యమధ్యలో చుట్టం చూపుగా వచ్చి చూసుకొని వెళుతున్నారు. అధికారుల పర్యవేక్షణ లేకపోవడంతో సిబ్బంది లేక బేస్ క్యాంపులు వెలవెలబోతున్నాయి. బేస్ క్యాంపులను నిరంతరం పర్యవేక్షించేందుకు ఆరుగురు సిబ్బందితో ఏర్పాటు చేసిన స్ట్రైకింగ్ టీమ్ కానరాలేదు. స్ట్రైకింగ్ సిబ్బందిని రేంజ్ కార్యాలయంలో వినియోగించుకుంటున్నారు. దీంతో రంగురాళ్ల క్వారీల వద్ద భద్రత కొరవడింది.



సిబ్బంది లేక వెలవెలబోతున్న ఆరిల్లోవ బేస్ క్యాంపు

ఉదాసీనంగా ఉంటే ప్రమాదమే..

బేస్ క్యాంపు ఉన్నప్పటికీ సిబ్బంది నిర్లక్ష్యం కారణంగా 2021 ఆగస్టులో కొంత మంది కరక కొండపై తవ్వకాలకు సిద్ధమయ్యారు. అప్పట్లో ఒకరిని అదుపులోకి తీసుకుని విచారించగా రంగురాళ్ల తవ్వకాలకు సహకరించిన వ్యక్తి డీఎఫ్‌వో వద్ద అవుట్ సోర్సింగ్ పద్ధతిలో పనిచేస్తున్న డ్రైవర్ అని తేలింది. ఈ విషయం అప్పట్లో పెద్ద సంచలనం అయింది. ఇదే విధంగా గతంలో సిబ్బంది లేకపోవడాన్ని గమనించిన తవ్వకందారులు ఆరిల్లోవ అటవీ ప్రాంతంలో తవ్వకాలకు సిద్ధం కాగా అటవీ సిబ్బంది అప్రమత్తమై దాడులు నిర్వహించారు. ఆ సమయంలో తవ్వకందారులు అటవీ సిబ్బందిపై రాళ్లు రువ్వి తప్పించుకున్నారు. ఈ రెండు సంఘటనలు అప్పట్లో ఆగస్టు నుంచి సెప్టెంబర్ నెలల్లోనే జరిగాయి. తవ్వకాలకు దిగిన కూలీలు క్వారీలు కుప్పకూలి ప్రాణాలు కోల్పోయిన ఘటనలూ గతంలో ఉన్నాయి. ప్రస్తుతం విస్తారంగా కురుస్తున్న వర్షాలతో తవ్వకాలు మొదలైనట్టు సమాచారం. ఈ సమయంలో కట్టుదిట్టమైన చర్యలు తీసుకోవాల్సిన అటవీ అధికారులు నిఘాను గాలికి వదిలేశారు. ఇక్కడి క్వారీల్లో లభ్యమయ్యే అలెక్స్ రకం రంగురాళ్లకు గిరాకీ ఉంది. వీటి ధర కోట్ల రూపాయల్లో ఉంటుంది. ఇంతటి విలువ ఉన్నందునే రంగురాళ్ల వ్యాపారులు వీటి కోసం తరచూ తవ్వకాలకు ప్రయత్నిస్తున్నారు. అటవీ అధికారులు అప్రమత్తమై క్వారీల వద్ద నిఘా కట్టుదిట్టం చేయాల్సిన అవసరం ఎంతైనా ఉంది.

సచివాలయ సిబ్బంది మెడకు పీ4 గుదిబండ

- అధికారులకు దాతలను వెతికి పట్టుకునే పనులు
- వాళ్లు ససేమిరా అనే సరికి సచివాలయ సిబ్బందికి అప్పగింత
- బంగారు కుటుంబాలు, మార్గదర్శకుల మధ్య సమన్వయ బాధ్యతలు
- ఇప్పటికే పని ఒత్తిడితో నిరసన బాట పట్టిన సచివాలయ సిబ్బంది



సాక్షి, అనకాపల్లి: గ్రామ, **వార్డు సచివాల**య సిబ్బందిపై రాష్ట్ర ప్ర**భుత్వం పీ4 భా**రం మోపింది. బంగారు **కుటుంబాలను** దత్తత తీసుకునే మార్గదర్శ**కులను వారు** వెతికి పట్టుకోవాల్సి ఉంది. **పీ4 కార్య**క్రమంలో బంగారు కుటు**ంబాలకు,** మార్గదర్శులకు సంధానకర్త**లుగా సచి**వాలయ సిబ్బందే వ్యవ**హరించాల్సి** ఉంటుంది. ఇప్పటికే ప**నిభారంతో** సతమతమవుతున్న సచివా**లయ సిబ్బంది** కొత్త బాధ్యతలతో బెంబే**లెత్తుతున్నారు. అధి**కారం చేపట్టిన తరువాత **వలంటీర్ వ్యవస్థను ని**ర్దాక్షిణ్యంగా నిలిపివేసిన కూటమి ప్రభుత్వం.. వారు చేసే ఇంటింటి సర్వే వంటి పనులను, వాట్సాప్ సర్వీస్ రిజిస్ట్రేషన్ ప్రక్రియను సచివాలయ సిబ్బందికి అప్పగించింది. సంక్షేమ పథకాలు, గ్రామ పరిపాలన సంబంధిత పనులతో రోజంతా బిజీబిజీగా ఉండే వారికి ఇప్పుడు పీ4 గుదిబండను తగిలించారు. అధికారుల ద్వారా మార్గదర్శకులు ముందుకు రాలేదన్న కారణంగానే.. సచివాలయ ఉద్యోగులకు ఈ పని అప్పగించారని భావిస్తున్నారు. సచివాలయ సిబ్బందికి ఇటీవల కలెక్టర్ విజయ కృష్ణన్ ఆధ్వర్యంలో శిక్షణ కార్యక్రమాన్ని నిర్వహించారు. మార్గదర్శులు, బంగారు కుటుంబాలతో సమావేశం ఏర్పాటు చేసి వారికి కావల**సిన అవసరాలు** గుర్తించి మార్గదర్శులతో **అనుసంధానం** చేసే బాధ్యత తీసుకోవా**లంటూ హుకుం** జారీ చేశారు. జిల్లాలోని **ఏడు నియోజక**వర్గాల పరిధిలో 522 సచి**వాలయాలు ఉ**న్నాయి. వీటి పరిధిలో **మొత్తం 80,163** బంగారు కుటుంబాలకు **గాను 2,06,5**26 మంది కుటుంబ **సభ్యులను గు**ర్తించారు. 6,420 మంది **మార్గదర్శు**లు ముందుకు **వచ్చారు**. వారు ఇంతవరకు **47,597 కుటుంబాలను** దత్తత తీసుకున్నారు. ఇంకా **32,571 కుటుంబా**లను దత్తత చేసుకోవాల్సి ఉంది.

ప్రభుత్వానికి సిబ్బంది నోటీసులు

సచివాలయ ఉద్యోగులు తీవ్ర అసంతృప్తితో ఉన్నారు. తాము ఇంత కష్టపడుతున్నా తగిన గౌరవం దక్కడం లేదని మనస్తాపం చెందుతున్నారు. సమస్యల పరిష్కారం, ఉద్యోగుల ఆత్మగౌరవ పరిరక్షణ డిమాండ్లతో ఇప్పటికే వారు ప్రభుత్వానికి నోటీసు ఇచ్చారు. 15 రోజుల్లోగా సమస్యలు పరిష్కరించని పక్షంలో రాష్ట్రవ్యాప్తంగా ఆందోళనకు దిగనున్నట్లు ఈనెల 8న గ్రామ, వార్డు సచివాలయ ఉద్యోగ సంఘాల ఐక్యవేదిక ప్రతినిధులు ప్రభుత్వానికి నోటీసు ఇచ్చిన విషయం తెలిసిందే.

వీఆర్వోల సంఘం అసోసియేట్ అధ్యక్షుడిగా శ్రీనివాసరావు

పరవాడ/మునగపాక: ఆంధ్రప్రదేశ్ గ్రామ రెవెన్యూ అధికారుల సంఘ అసోసియేట్ అధ్యక్షుడిగా పరవాడ మండలం, భరణికం గ్రామ రెవెన్యూ అధికారి బొమ్మిరెడ్డిపల్లి శ్రీనివాసరావు ఏకగ్రీవంగా ఎన్నికయ్యారు. అమరావతిలో జరిగిన రాష్ట్ర కార్యవర్గ సమావేశంలో మునగపాక మండలం వెంకటాపురం గ్రామానికి చెందిన ఆయనను ఎన్నుకున్నారు. అనంతరం శ్రీనివాసరావును రాష్ట్ర వీఆర్వో సంఘ నాయకులు ఘనంగా సత్కరించారు. ఏపీ జేఏసీ అమరావతి చైర్మన్, రెవెన్యూ సర్వీసెస్ అసోసియేషన్ అధ్యక్షుడు బొప్పరాజు వెంకటేశ్వర్లు, రాష్ట్ర గ్రామ రెవెన్యూ అధికారుల సంఘ అధ్యక్షుడు కోన ఆంజనేయ కుమార్, ప్రధాన కార్యదర్శి జి.అనుపమ, విశాఖ జిల్లా పూర్వపు అధ్యక్షుడు సబ్బవరపు త్రినాథ రామదాస్, రాష్ట్ర వీఆర్వోల అధికారుల సంఘ ఉపాధ్యక్షుడు పోతుల శంకర రావు శ్రీనివాసరావును అభినందించారు.



శ్రీనివాసరావుకు సత్కారం

మనసు లఘు చిత్రానికి పుదుచ్చేరి సీఎం ప్రశంసలు

సీతంపేట (విశాఖ): నగరానికి చెందిన దర్శకుడు పైడి శంకర్రావు సుదీప్ సాయి హీరోగా రూపొందించిన లఘు చిత్రం 'మనసు'కు అరుదైన గౌరవం లభించింది. ఈ లఘు చిత్రాన్ని పుదుచ్చేరి ముఖ్యమంత్రి ఎన్. రంగస్వామి వీక్షించి, చిత్ర బృందాన్ని ప్రశంసించారు. సాహిత్య అకాడమి మాజీ సభ్యుడు డాక్టర్ సుందర్ మురుగన్ ఈ లఘు చిత్రం ఇతివృత్తాన్ని సీఎం దృష్టికి తీసుకెళ్లారు. మనసు లఘు చిత్రం భారతీయుల మధ్య ఐక్యత, ప్రేమ, శాంతి, మానవతా విలువలను ప్రతిబింబిస్తూ, భావితరాలకు మెరుగైన మార్గనిర్దేశం చేసేలా ఉందని సీఎం రంగస్వామి కొనియాడారు. ఈ చిత్రం ప్రపంచ శాంతి అనే మూల సందేశాన్ని, భారతదేశ సంప్రదాయానికి నిలువెత్తు అద్దంగా ఉంటుందని, ప్రతి భారతీయుడు చూడాల్సిన చిత్రమని పేర్కొన్నారు. ఈ సందర్భంగా దర్శకుడు పైడి శంకర్రావు, హీరో సుదీప్ సాయిలను ముఖ్యమంత్రి సత్కరించారు. చిత్ర యూనిట్ తరఫున నిర్మాత పైడి సత్యమణి సీఎంకు కృతజ్ఞతలు తెలిపారు.



హీరో సుదీప్‌ని సత్కరిస్తున్న పుదుచ్చేరి సీఎం

ఇద్దరు భవానీ భక్తుల దుర్మరణం



ఘటనా స్థలిలో శివ మృతదేహం



పంటబోదెలో శ్రీను మృతదేహం



పక్కుర్తి శివ, పక్కుర్తి శ్రీను (ఫైల్)

- మరొకరికి తీవ్ర గాయాలు
- కాలినడకన విజయవాడ వెళుతుండగా వెనుక నుంచి ఢీకొట్టిన కారు

నల్లజర్ల/నక్కపల్లి: కాలినడకన విజయవాడ కనకదుర్గమ్మ దర్శనానికి వెళ్తున్న నక్కపల్లి మండలం దోశలపాడు గ్రామానికి చెందిన ఇద్దరు భవానీ మాలధారులు రోడ్డు ప్రమాదంలో దుర్మరణం పాలయ్యారు. తూర్పుగోదావరి జిల్లా నల్లజర్ల మండలం పుల్లలపాడు వద్ద జాతీయ రహదారిపై ఆదివారం ఉదయం వెనుక నుంచి కారు ఢీకొన్న ఘటనలో వీరు అక్కడికక్కడే మృతి చెందగా మరొకరికి తీవ్రగాయాలయ్యాయి. పోలీసులు తెలిపిన వివరాల ప్రకారం.. పక్కుర్తి శివ, పక్కుర్తి శ్రీను, పక్కుర్తి శేషీలు, కోనా గోవిందు భవానీ మాలలు ధరించి ఈ నెల 24న తమ స్వగ్రామమైన దోశలపాడు గ్రామం నుంచి ఇరుముళ్లు కట్టుకొని పాదయాత్రగా విజయవాడ బయలు దేరారు. వీరంతా ఆదివారం ఉదయం పుల్లలపాడు జాతీయ రహదారిపైకి వచ్చేసరికి విశాఖపట్నం నుంచి హైదరాబాదు వెళ్తున్న పశ్చిమబెంగాల్‌కు చెందిన కారు వీరిని వెనుక నుంచి ఢీకొట్టింది. ఈ సంఘటనలో శివ చక్రాల కింద, గాలిలోకి ఎగిరి పక్కనే పంట బోదెలోకి పడిన శ్రీను అక్కడికక్కడే మృతి చెందగా శేషీలుకు రెండు కాళ్లూ విరిగిపోయాయి. ఆయనను ఏలూరు ప్రభుత్వ ఆసుపత్రికి తరలించారు. గోవిందు ఫోన్ మాట్లాడుతూ దూరంగా ఉండటంతో క్షేమంగా బయటపడ్డాడు. మృతి చెందిన శివకు భార్య దేవి, రెండేళ్ల కుమారుడు ఉన్నారు. శ్రీను అవివాహితుడు కాగా వీరంతా వ్యవసాయ కూలీలే. మృతదేహాలను పోస్టుమార్టం కోసం తాడేపల్లిగూడెం తరలించి కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్టు ఎస్ఐ దుర్గాప్రసాద్ తెలిపారు.

న్యాయవాదులకు బార్ కౌన్సిల్ శుభవార్త

- వైద్య, జీవనభృతి పెంపు, భార్యలకు కూడా వర్తింపు
- రాష్ట్ర బార్ కౌన్సిల్ కీలక నిర్ణయం



విశాఖ లీగల్: న్యాయవాదుల సంక్షేమం కోసం రాష్ట్ర బార్ కౌన్సిల్ కీలక నిర్ణయాలు తీసుకుంది. న్యాయవాదులకు అందించే వైద్య సహాయాన్ని ఇకపై వారి భార్యలకు కూడా వర్తింపజేస్తూ సంచలన నిర్ణయం తీసుకుంది. ఈ వివరాలను కౌన్సిల్ ఉపాధ్యక్షుడు ఎస్. కృష్ణమోహన్ విశాఖలో ఆదివారం ప్రకటించారు. గతంలో రూ.1,50,000 ఉన్న వైద్య సహాయాన్ని రూ. 2,50,000కు పెంచారు. న్యాయవాదుల జీవన భృతిని రూ. 6 లక్షల నుంచి రూ. 9 లక్షలకు పెంచారు. సంక్షేమ నిధి పరిధిలో లేని న్యాయవాదులు ప్రమాదవశాత్తు మరణిస్తే వారికి రూ. 5 లక్షలు చెల్లించాలని బార్ కౌన్సిల్ తీర్మానించింది. ఈ కొత్త పథకాలన్నీ అక్టోబర్ 1వ తేదీ నుంచి అమల్లోకి వస్తాయి. ఈ నిర్ణయాలు బార్ కౌన్సిల్ అధ్యక్షుడు ఎస్. ద్వారకానాథ్ రెడ్డి అధ్యక్షతన జరిగిన సర్వసభ్య సమావేశంలో తీసుకున్నారు. ఉపాధ్యక్షుడు కృష్ణమోహన్ ఈ సందర్భంగా రాష్ట్ర ప్రభుత్వంపై విమర్శలు గుప్పించారు. కొత్త కూటమి సర్కార్ ఇప్పటివరకు ఒక్క రూపాయి కూడా విడుదల చేయలేదని ఆరోపించారు. మృతి చెందిన సుమారు 1300 మంది న్యాయవాదుల కుటుంబాలకు ఒక్కొక్కరికీ రూ. 4 లక్షల వంతున నిధులు తక్షణమే విడుదల చేయాలని ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు. 'లా మిత్ర' పేరుతో ఎన్నికల హామీ ఇచ్చిన రూ. 10,000 గౌరవ భృతిని ఇప్పటివరకు విడుదల చేయలేదని, పది వేలకు పైగా ఉన్న యువ న్యాయవాదుల జీవన సహాయ నిధిని వెంటనే విడుదల చేయాలని కోరారు. రాష్ట్ర బార్ కౌన్సిల్‌కు ప్రభుత్వం చెల్లించవలసిన రూ. 75 కోట్లు తక్షణమే విడుదల చేయాలని ఆయన డిమాండ్ చేశారు.

ఒక సార్.. ఇద్దరు బాస్‌లు



కరవమంటే కప్పకు కోపం.. విడవమంటే పా**ముకు కోపం** అన్నట్లుగా ఉంది.. వాల్తేరు డివిజన్ డివిజన**ల్ రైల్వే** మేనేజర్(డీఆర్‌ఎం) పరిస్థితి. ఒక సార్‌కి ఇద్ద**రు బాస్‌లు** ఉండడంతో ఎటు వెళ్లాలో.. ఏం చేయాలో.. **తెలియక** అయోమయంలోనూ.. అదే సమయంలో **ఒత్తిడికి గురవు**తున్నారు. దక్షిణ కోస్తా రైల్వే జోన్‌కు జీఎంని ప్ర**కటించిన** కేంద్రం.. ఇంకా గెజిట్ విడుదల చేయకపోవ**డంతో ఎవరికి** వారే అన్న చందంగా మారింది. ఇద్దరు జీఎం**ల మధ్య** నలిగిపోతున్న డీఆర్‌ఎం.. ఇదేం బాధరా భగ**వంతుడా** అనుకుంటూ బదిలీ కోసం పాట్లు పడుతున్నా**రు.**

అడకత్తెరలో పోకచెక్కలా వాల్తేరు డీఆర్‌ఎం లలిత్ బోరా పరిస్థితి

- వాల్తేరు డివిజన్‌లో ఇద్దరు జీఎంల **హడావుడి**
- దక్షిణ కోస్తా జోన్ జీఎం సందీప్ **మాథుర్ వరుస రివ్యూలు**
- అదే సమయంలో ఈస్ట్ కోస్ట్ జోన్ జీఎం పరమేశ్వర్ పర్యటనలు
- గెజిట్ నోటిఫికేషన్ విడుదల కాకపోవడంతోనే తలపోటు
- ముంబై బదిలీ కోసం డీఆర్‌ఎం ప్రయత్నాలు ముమ్మరం

సాక్షి, విశాఖపట్నం: విశాఖ కేంద్రంగా దక్షిణ కోస్తా రైల్వే జోన్ ప్రకటించి ఆరేళ్లు దాటినా, క్షేత్రస్థాయిలో మాత్రం 'మూడడుగులు ముందుకు, ఆరడుగులు వెనక్కి' అన్నట్లుగా ఉంది. కేంద్ర, రాష్ట్ర రాజకీయాలు, రైల్వే బోర్డు నిర్లక్ష్యం కారణంగా కార్యకలాపాలు మొదలు కాలేదు. మూడు నెలల క్రితం దక్షిణ కోస్తా రైల్వే జోన్ జీఎంగా నియమితులైన సందీప్ మాథుర్ నెల రోజులుగా విశాఖలోనే ఉంటూ, గెస్ట్ హౌస్ నుంచి కార్యకలాపాలు పర్యవేక్షిస్తున్నారు. ముడసర్లోవ ప్రధాన కార్యాలయ పనులు పర్యవేక్షిస్తూ, డీఆర్‌ఎం లలిత్ బోరాతో కలిసి సమీక్షలు, పర్యటనలు చేస్తున్నారు. అయితే జోన్ ఏర్పాటు కాగితాలకే పరిమితం కావడంతో డీఆర్‌ఎంపై ఒత్తిడి మొదలైంది.

నాకొద్దు బాబోయ్.!

ఒక సార్ రివ్యూలు చేస్తూ బయలుదేరితే, మరొక సార్ ఫోన్‌లో ఏర్పాట్లు చేయమని ఆదేశాలు జారీ చేస్తారు. ప్రస్తుతం వాల్తేరు డీఆర్‌ఎం లలిత్ బోరా, డివిజనల్ అధికారుల పరిస్థితి ఇదే. ఒకవైపు దక్షిణ కోస్తా రైల్వే జోన్ కొత్త జీఎం, మరోవైపు ఈస్ట్ కోస్ట్ రైల్వే జీఎం కలిసి డీఆర్‌ఎంతో చెడుగుడు ఆడుకుంటున్నారు. ముందు రోజు ఉదయం నుంచి రాత్రి వరకూ కొత్త జీఎం రివ్యూలతో, ఆ తర్వాత రోజు ప్రస్తుత జీఎం పర్యటనలతో డీఆర్‌ఎం క్షణం తీరిక లేకుండా ఇద్దరి మధ్య నలిగిపోతున్నారు. ఇటీవల ఒక జీఎం పర్యటనలో ఉన్న సమయంలోనే, మరో జీఎం ఫోన్ చేసి లైన్లు పరిశీలించేందుకు వస్తున్నానని, ఏర్పాట్లు చేయాలని హుకుం జారీ చేశారు. సమీక్షలు కూడా ఇరు జీఎంలు పోటాపోటీగా నిర్వహిస్తుండటంతో, వారికి సమాధానం ఇవ్వడంలోనూ, ఏర్పాట్లలోనూ అధికారులు ఉరుకులు, పరుగులు తీస్తున్నారు. దీంతో అధికారుల్లో కొందరు తమ ఉద్యోగాలపై విరక్తి చెందుతూ తలలు పట్టుకుంటున్నారు. ఇక డీఆర్‌ఎం లలిత్ బోరా పరిస్థితి అయితే చెప్పాల్సిన పనిలేదు. కుటుంబంతో గడిపే తీరిక కూడా ఇవ్వడం లేదంటూ ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. ఈ పరిస్థితుల్లో వాల్తేరులో పనిచేయడం కంటే, ఇతర ప్రాంతాలకు ట్రాన్స్‌ఫర్ పెట్టుకోవడం మంచిదంటూ తోటి అధికారుల వద్ద వాపోతున్నట్లు తెలిసింది. ఇప్పటికే ఆయన ముంబైకి బదిలీ చేయాలంటూ రైల్వే బోర్డును కోరినట్లు సమాచారం.



వాల్తేరు డీఆర్‌ఎంతో కలిసి విశాఖ రైల్వే స్టేషన్‌ను పరిశీలిస్తున్న ఈస్ట్‌కోస్ట్ రైల్వే జీఎం పరమేశ్వర్ (ఫైల్)

గెజిట్ లేకపోవడమే అసలు సమస్య

వాల్తేరు డివిజన్‌లో నెలకొన్న మొత్తం 'తలపోటు' వ్యవహారానికి ప్రధాన కారణం.. జోన్‌కు సంబంధించిన గెజిట్ నోటిఫికేషన్ విడుదల కాకపోవడమే అని అధికారులు స్పష్టం చేస్తున్నారు. గెజిట్ వస్తేనే సందీప్ మాథుర్ జోన్‌కు అసలైన జనరల్ మేనేజర్‌గా వ్యవహరించగలరు.. అప్పుడు కార్యకలాపాలు సజావుగా సాగుతాయి. గెజిట్‌తో పాటు కార్యాచరణ ప్రకటించిన తర్వాతే.. జీఎంతో పాటు అసిస్టెంట్ జీఎం, 10 విభాగాలు, వాటి ప్రిన్సిపల్ హెచ్‌వోడీలు, సిబ్బంది సహా మొత్తంగా దాదాపు 180 మంది అధికారుల నియామకం పూర్తవుతుంది. వీరి నియామకం తర్వాతే జోన్ ఆపరేషన్స్ మొదలయ్యే అవకాశం ఉంది. అధికారుల నియామకాలు ఒక్కొక్కటిగా జరుగుతున్నా, గెజిట్ రాకపోవడం వల్లే ఈ దుస్థితి దాపురించిందని వాల్తేరు అధికారులు వాపోతున్నారు. ప్రస్తుత పరిస్థితులు చూస్తుంటే, దసరాకు కూడా జోన్ ప్రారంభమయ్యే సూచనలు కనిపించడం లేదు.

ఇది నా సంస్థానమంటూ..!

దక్షిణకోస్తా రైల్వే జోన్‌కు కొత్త జీఎంను నియమించినా గెజిట్ విడుదల చేయకపోవడంతో భువనేశ్వర్ కేంద్రంగా ఉన్న తూర్పు కోస్తా రైల్వే జోన్ పరిధిలోనే వాల్తేరు డివిజన్ కొనసాగుతోంది. జీఎం సందీప్ మాథుర్ జోన్ కార్యకలాపాల్లో చురుగ్గా వ్యవహరిస్తుండగా.. ఈస్ట్‌కోస్ట్ రైల్వే జీఎం పరమేశ్వరన్ ఫంక్వాలా కూడా హడావుడి మొదలుపెట్టారు. ఇంకా గెజిట్ రాకపోవడంతో వాల్తేరు డివిజన్‌కు తానే జీఎంనంటూ వరుస పర్యటనలతో హడావుడి చేస్తున్నారు.



జోన్ ప్రధాన కార్యాలయం నిర్మాణ పనులు పరిశీలిస్తున్న దక్షిణ కోస్తా రైల్వే జోన్ జీఎం సందీప్ మాథుర్ (ఫైల్)

చురుగ్గా తాత్కాలిక కార్యాలయం పనులు

వీఎంఆర్‌డీఏ 'ది డెక్'లో తాత్కాలిక కార్యాలయం ఏర్పాటు చేయాలని ఆదేశాలు జారీ కావడంతో పనులు చురుగ్గా సాగుతున్నాయి. కొత్త జోన్‌కు ఇప్పటికే ప్రిన్సిపల్ చీఫ్ మెకానికల్ ఇంజినీర్ (పీసీఎంఈ), ఎలక్ట్రికల్ విభాగంలో హెచ్ఏజీ అధికారి (హయ్యర్ అడ్మినిస్ట్రేటివ్ గ్రేడ్)తో సహా మరో ఇద్దరి నియామకాలు పూర్తయ్యాయి. వీలైనంత త్వరగా టెంపరరీ ఆఫీస్‌ను అందుబాటులోకి తెస్తున్నామని అధికారులు చెబుతున్నప్పటికీ, ఈ కార్యాలయంలో విధులు ప్రారంభించాలన్నా గెజిట్ విడుదల తప్పనిసరి అని స్పష్టం చేస్తున్నారు. దీంతో గెజిట్ ఎప్పుడొస్తుందా అని అంతా ఎదురుచూస్తున్నారు.

క్లుప్తంగా

మాజీ మంత్రి కురసాలను కలిసిన బొడ్డేడ



మాజీ మంత్రి కురసాల కన్నబాబుతో బొడ్డేడ

మునగపాక: వైఎస్సార్‌సీపీ ఉత్తరాంధ్ర రీజనల్ కో–ఆర్డినేటర్ కురసాల కన్నబాబును ఆదివారం కాకినాడలో పార్టీ అనకాపల్లి పార్లమెంట్ నియోజకవర్గ సమన్వయకర్త బొడ్డేడ ప్రసాద్ మర్యాద పూర్వకంగా కలిశారు. తనకు అవకాశం కల్పించడంలో సహకరించిన కన్నబాబు ఆశీర్వాదం తీసుకుని సత్కరించారు. పార్టీ నేతలు నరాలశెట్టి సూర్యనారాయణ, కాండ్రేగుల జగన్, పిన్నమరాజు రవీంద్రరాజు, ఈత బాబూరావు, బొడ్డేడ బుజ్జి, రామకృష్ణ, పెంటకోట శ్రీనివాసరావు, ఆడారి రమణబాబు, వెంకటప్పారావు తదితరులు పాల్గొన్నారు.

బ్యాడ్మింటన్ విజేత సంకీర్త్–కేతన్

విశాఖ స్పోర్ట్స్: రోటరీ మెగా బ్యాడ్మింటన్ టోర్నీ డబుల్స్ విజేతగా సంకీర్త్–కేతన్ (కాకినాడ) జోడీ నిలవగా, సింగిల్స్‌లో పైడిరాజు (విజయనగరం పోర్ట్) విజేతగా నిలిచాడు. డబుల్స్ ఫైనల్స్‌లో హర్ష–అరుణ్ (వైజాగ్ సురభి) జోడీ పరాజయం పాలై రన్నరప్‌గా నిలవగా, రాజశేఖర్–సునీల్ (గ్రేటర్ విశాఖ) జోడీ సెకండ్ రన్నరప్ సాధించింది. సింగిల్స్‌లో హర్ష రన్నరప్‌గా నిలిచాడు. పోలియో నివారణ నిధి సేకరణలో భాగంగా ఆదివారం రైల్వే ఇండోర్ స్పోర్ట్స్ ఎన్‌క్లేవ్‌లో రోటరీ క్లబ్ గ్రేటర్ విశాఖ ఆధ్వర్యంలో బ్యాడ్మింటన్ టోర్నీ నిర్వహించారు. పలు రోటరీ డిస్ట్రిక్ట్‌ల నుంచి దాదాపు 80 క్లబ్‌లకు చెందిన డబుల్స్ జట్లు పోటీలో తలపడ్డాయి. ముందుగా ఈ కార్యక్రమాన్ని డిస్ట్రిక్ట్ గవర్నర్ కల్యాణచక్రవర్తి, క్లబ్ అధ్యక్షుడు చింతా నేతాజీ ప్రారంభించారు. క్లబ్ కార్యదర్శి భాస్కర నరేంద్ర జగన్, పూర్వ గవర్నర్లు కిశోర్‌కుమార్, బ్రహ్మానందం తదితరులు పాల్గొన్నారు.

టెట్ నుంచి ఇన్ సర్వీస్ టీచర్లకు మినహాయింపు ఇవ్వాలి



ఎస్టీయూ నాయకుడు పైడిరాజు

అరిలోవ: టీచర్ ఎలిజిబిలిటీ టెస్ట్ (టెట్) పరీక్ష నుంచి ఇన్ సర్వీస్ ఉపాధ్యాయులకు మిన హాయింపు ఇవ్వాలని స్టేట్ టీచర్స్ యూనియన్ (ఎస్టీయూ) జిల్లా ప్రధాన కార్యదర్శి ఇమంది పైడిరాజు రాష్ట్ర ప్రభుత్వాన్ని కోరారు. సుప్రీంకోర్టు ఇటీవల ఇచ్చిన తీర్పు ప్రకారం ఐదేళ్ల పైబడి సర్వీస్ ఉన్న ఉపాధ్యాయులు తప్పనిసరిగా రెండేళ్లలో టెట్ అర్హత సాధించాలని, లేదంటే ఉద్యోగం నుంచి తప్పుకోవాల్సి ఉంటుందని స్పష్టం చేసింది. ఈ తీర్పు ప్రభుత్వ ఉపాధ్యాయుల్లో తీవ్ర ఆందోళనకు కారణమైందని తెలిపారు. సుప్రీంకోర్టు తీర్పు ప్రకారం.. 2010 అక్టోబరు 23 కంటే ముందు నియమితులైన ఉపాధ్యాయులు అందరూ కచ్చితంగా టెట్ అర్హత పరీక్ష ఉత్తీర్ణులు కావాలి. రాష్ట్రంలో 1995 నుంచి వివిధ డీఎస్సీల ద్వారా నియమితులైన వేలాది మంది ఉపాధ్యాయులకు ఈ నిబంధన తీవ్ర సమస్యగా మారిందని ఆందోళన వ్యక్తం చేశారు.

మహాత్మా నిన్ను మరిచారు...

బుచ్చెయ్యపేట: జాతిపిత మహాత్మాగాంధీ జయంతి దగ్గర పడుతోంది. ఐదు రోజుల్లో గాంధీ జయంతి వేడుకలున్నా పలు గ్రామాల్లో మాత్రం గాంధీ విగ్రహాలు శిథిలావస్థలో నే ఉన్నాయి. అహింసా మార్గంలో నడిచి బ్రిటిష్ వారిని దేశం నుండి విడిచి వెళ్లేలా చేసి దేశానికి స్వాతంత్ర్యం తీసుకొచ్చిన మహాత్ముని విగ్రహాలు విరిగిపోయి దెబ్బతిని ఉండడాన్ని చూసి పలువురి మనస్సులు కలవరపడుతున్నాయి. విద్యార్థులు, నేటి యువత జాతీయ నాయకులను ఆదర్శంగా తీసుకోవాలని, వారి అడుగు జాడల్లో నడుచుకోవాలని గ్రామాల్లో వారి విగ్రహాలను ఏర్పాటు చేస్తున్నారు. జాతీయ నాయకుల విగ్రహాల ఏర్పాటు తరవాత వాటి పరిరక్షణకు చర్యలు తీసుకోవడం లేదు. పొట్టిదొరపాలెంలో ఆర్‌అండ్‌బీ రోడ్డు పక్కన ఆంజనేయస్వామి విగ్రహం ముందు ఏర్పాటు చేసిన జాతిపిత మహాత్మాగాంధీ విగ్రహం ఎడం చేయి పూర్తిగా విరిగిపోగా కుడి చేతిలో చేతి కర్ర లేదు. మేజర్ పంచాయతీ వడ్డాది కొత్తూరులో ఏర్పాటు చేసిన గాంధీ విగ్రహం కుడి, చేతి కర్ర దెబ్బతిన్నాయి. అలాగే పలు గ్రామాల్లో ఏర్పాటు చేసిన గాంధీ విగ్రహాలకు రంగులు పోయి రూపు రేఖలు దెబ్బతిని ఉన్నాయి. స్థానికులు రానున్న గాంధీ జయంతి వేడుకలకు ముందే దెబ్బతిన్న విగ్రహాలను బాగు చేసి రంగులు వేసి అందంగా ముస్తాబు చేస్తారని పలువురు కోరుతున్నారు.



పొట్టిదొరపాలెంలో చేయి విరిగిన గాంధీ విగ్రహం



వడ్డాది కొత్తూరులో కుడిచేయి దెబ్బతిన్న గాంధీ విగ్రహం

సమ సమాజమే జాషువా ఆకాంక్ష



ప్రసంగిస్తున్న ప్రముఖ రచయిత ఆచార్య బేతవోలు రామబ్రహ్మం

సీతంపేట: కవి కోకిల గుర్రం జాషువా కోరుకున్న సమ సమాజ స్థాపనకు అందరం సమష్టిగా కృషి చేయాలని రాష్ట్రపతి పురస్కార గ్రహీత, ప్రముఖ రచయిత ఆచార్య బేతవోలు రామబ్రహ్మం పిలుపునిచ్చారు. బీజేపీ జిల్లా శాఖ ఆధ్వర్యంలో ఆదివారం అక్కయ్యపాలెం సాగరమాల కన్వెన్షన్స్ హాల్లో జరిగిన జాషువా జయంతి సభలో ఆయన ఆయన మాట్లాడారు. నాటక రచయితగా రచనా రంగంలో ప్రవేశించిన జాషువా, తన స్వీయ అనుభవాన్ని కవిత్వీకరించడం వల్లే మహాకవి అయ్యారని రామబ్రహ్మం కొనియాడారు. స్త్రీని కేవలం శృంగార వస్తువుగా చిత్రీకరించే కవిత్వానికి భిన్నంగా, తెలుగు పద్య లోకాన్ని నూతన మార్గంలోకి నడిపించిన ఘనత జాషువాదని ప్రశంసించారు. బీజేపీ జిల్లా అధ్యక్షుడు పరశురామరాజు, పార్టీ రాష్ట్ర అధికార ప్రతినిధి సుహాసిని ఆనంద్, బుల్లయ్య కళాశాల తెలుగు విభాగాధిపతి ఎం.సుబ్బారావు, పలువురు రచయితలు, సాహితీవేత్తలు పాల్గొన్నారు.

పాదచారిని తప్పించబోయి మృత్యు ఒడికి..



ప్రమాదంలో మృతి చెందిన నేవీ ఉద్యోగి రఘురామిరెడ్డి



ప్రమాద స్థలంలో విరిగిపోయిన కిలోమీటరు రాయి

- పులపర్తి వద్ద ప్రమాదంలో నేవీ ఉద్యోగి దుర్మరణం
- మరొకరికి తీవ్ర గాయాలు

యలమంచిలి రూరల్: దసరా పండుగకు కుటుంబంతో ఆనందంగా గడపడానికి వెళ్తున్న నేవీ ఉద్యోగిని యలమంచిలి మండలం పులపర్తి కూడలి వద్ద 16వ నెంబరు జాతీయ రహదారిపై జరిగిన రోడ్డు ప్రమాదంలో మృత్యువు కబళించింది. విశాఖపట్నం నుంచి హైదరాబాద్‌కు బైక్‌పై వెళ్తుండగా పాదచారిని తప్పించబోయి తాను ప్రయాణిస్తున్న ద్విచక్ర వాహనాన్ని అదుపు చేయలేక రోడ్డు మధ్యలో ఉన్న డివైడర్‌ను ఢీకొట్టి అక్కడికక్కడే ప్రాణాలు కోల్పోయాడు నేవీ ఉద్యోగి పి.రఘురామిరెడ్డి(31). ఇదే ప్రమాదంలో పులపర్తికి చెందిన పాదచారి పులి మల్లికార్జున్ (55) తీవ్రంగా గాయపడ్డారు. యలమంచిలి పట్టణ ఎస్‌ఐ కె.సావిత్రి అందజేసిన వివరాల ప్రకారం మృతుడు ఆదివారం మధ్యాహ్నం రెండు గంటల సమయంలో విశాఖపట్నం నుంచి తుని వైపు వెళ్తున్న బైక్ మితిమీరిన వేగంతో ప్రయాణిస్తూ యలమంచిలి మండలం పులపర్తి వద్ద రోడ్డు దాటుతున్న వ్యక్తిని తప్పించబోయి ప్రమాదానికి గురైంది. పాదచారితో పాటు డివైడర్‌ను ఢీకొట్టిన బైకు పల్టీలు కొట్టింది. బైకు నడుపుతున్న రఘురామిరెడ్డికి హెల్మెట్ ఉన్నప్పటికీ ప్రమాదస్థలంలోనే తలకు తీవ్ర గాయమై రక్తపు మడుగులో అక్కడికక్కడే ప్రాణాలొదిలాడు. రోడ్డు పక్కనున్న కిలోమీటరు రాయి సైతం విరిగిపోవడాన్ని బట్టి ప్రమాద తీవ్రతను అర్థం చేసుకోవచ్చు. ప్రమాదస్థలం వద్ద భయానక పరిస్థితులు కనిపించాయి. ప్రమాదం కారణంగా కొంతసేపు వాహనాల రాకపోకలకు ఆటంకం ఏర్పడింది. మృతదేహాన్ని యలమంచిలి మార్చురీలో భద్రపరిచారు. మృతుడి ఆధార్ వివరాలతో చిరునామా తెలుసుకున్న పోలీసులు అతడి భార్యకు ఫోన్ చేసి ప్రమాద సమాచారం అందజేశారు. ప్రమాదంలో పాదచారుడు మల్లికార్జున్ కాలు విరిగిపోయింది. గాయపడిన వ్యక్తికి అనకాపల్లి ఎన్టీఆర్ ఆస్పత్రిలో చికిత్స అందజేస్తున్నారు. ప్రమాదంపై గాయపడిన మల్లికార్జున్ అన్నయ్య పులి సన్యాసినాయుడు ఇచ్చిన ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేశారు.

నేడు జీవీఎంసీ స్థాయీ సంఘ సమావేశం

డాబాగార్డెన్స్: జీవీఎంసీ స్థాయీ సంఘ సమావేశం మేయర్ పీలా శ్రీనివాసరావు అధ్యక్షతన సోమవారం జరగనుంది. ఈ సమావేశంలో 91 అంశాలు చర్చకు రానున్నాయి. 28వ వార్డు సెవెన్‌హిల్స్ ఆసుపత్రి నుంచి ఎస్‌బీఐ బ్యాంకు వరకు, సిరిపురం జంక్షన్ నుంచి సర్దార్ వల్లభాయ్ పటేల్ విగ్రహం వరకు రూ.34.25 లక్షలతో బీటీ రోడ్డు, 29వ వార్డు పరిధి ఆర్‌కే బీచ్ జంక్షన్ నుంచి నేవల్ క్యాంటీన్ వరకు రూ.42.46లక్షలతో బీటీ రోడ్డు, 31వ వార్డు ఎల్‌ఐసీ వెనుక రూ.32.25 లక్షలతో బీటీ రోడ్డు, రూ.44.62 లక్షలతో ఆశీల్‌మెట్ట జంక్షన్ నుంచి ఎల్‌ఐసీ వెనుక రోడ్డు వరకు బీటీ రోడ్డు, 32వ వార్డు డీఆర్‌ఎం కార్యాలయం నుంచి ఎంఈఎస్ కార్యాలయం ఎదురు వరకు రూ.48.05 లక్షలతో బీటీ రోడ్డు, 35వ వార్డు డాబాగార్డెన్స్ నుంచి టౌన్‌కొత్త రోడ్డు వరకు, డాల్ఫిన్ జంక్షన్ మీదుగా సీహార్స్ జంక్షన్ వరకు రూ.30.52 లక్షలతో థర్మోప్లాస్టిక్ రోడ్డు మార్కింగ్, స్టడ్‌లు ఏర్పాటుపై చర్చించనున్నారు. రూ.47.92లక్షలతో 35వ వార్డు టౌన్ కొత్తరోడ్డు నుంచి సీహార్స్ జంక్షన్ వరకు బీటీ రోడ్డు, రూ.49.55లక్షలతో టౌన్‌కొత్తరోడ్డు నుంచి ఓల్డ్ పోస్టాఫీస్ జంక్షన్ వరకు బీటీ రోడ్డు పునరుద్ధరణకు చర్చ సాగనుంది. భాగస్వామ్య సదస్సు–2025 విశాఖలో నిర్వహిస్తున్న సందర్భంగా జోన్–8 పరిధి 90వ వార్డు శీలానగర్ నుంచి ఆర్ అండ్ బీ జంక్షన్ వరకు రూ.49.97 లక్షలతో అభివృద్ధి పనులు, రూ.48.35 లక్షలతో లేన్ మార్కింగ్, రూ.32.05 లక్షలతో విమానాశ్రయం నుంచి ఆర్ అండ్ బీ వరకు ముళ్ల తీగల కంచెకు మరమ్మతులు, ఎన్‌ఎస్‌టీఎల్ గోడకు ఆర్ట్ పెయింటింగ్, రూ.37.95 లక్షలతో ఎన్‌ఏడీ జంక్షన్ నుంచి గోపాలపట్నం పోలీస్ స్టేషన్ వరకు సెంట్రల్ డివైడర్లు, ఫుట్‌పాత్ మరమ్మతులు, పెయింటింగ్స్, రూ.26.85 లక్షలతో సెంట్రల్ డివైడర్లు, ఫుట్‌పాత్ మరమ్మతులు, రూ.31.10 లక్షలతో 90, 91, 92 వార్డులకు సంబంధించి ఎన్‌ఏడీ జంక్షన్ నుంచి గోపాలపట్నం జంక్షన్ వరకు బీఆర్‌టీఎస్ రోడ్డు నుంచి లేన్ మార్కింగ్, స్టడ్‌ల ఏర్పాటు, తదితర అభివృద్ధి పనులతో పాటు రెవెన్యూ, ఇంజినీరింగ్, పబ్లిక్ హెల్త్ అంశాలు సభ్యుల ఆమోదానికి చర్చకు రానున్నాయి.

8 నుంచి జాతీయ స్థాయి టెన్నికాయిట్ పోటీలు

అనకాపల్లి: 49వ జాతీయ సీనియర్ స్త్రీ, పురుషుల టెన్నికాయిట్ పోటీలు ఉత్తర ప్రదేశ్ రాష్ట్రం, నోయిడాలో నోయిడా యూనివర్శిటీలో ఈ ఏడాది అక్టోబర్ 8 నుంచి 12వ తేదీ వరకూ జరుగుతాయని జాతీయ టెన్నికాయిట్ అసోసియేషన్ (టెక్నికల్) కమిటీ చైర్మన్ కె.ఎస్.వి.సత్యనారాయణ ఆదివారం ఒక ప్రకటనలో తెలిపారు. ఈ పోటీలను ఉత్తరప్రదేశ్ రాష్ట్ర టెన్నికాయిట్ అసోసియేషన్ ఆధ్వర్యంలో నిర్వహించడం జరుగుతుందన్నారు. మన రాష్ట్రం నుంచి పాల్గొనే క్రీడాకారుల ఎంపిక ఇప్పటికే జరిగిందని తెలిపారు. మహిళలకు విజయనగరం జిల్లా చీపురుపల్లిలోని కోచ్ శశి(రామారావు), పురుషులకు కాకినాడ జిల్లా మండపేటలో కోచ్ కె.రమేష్ ఆధ్వర్యంలో ఈనెల 22 నుంచి వచ్చే నెల 5వ తేదీ వరకూ శిక్షణ ఇవ్వడం జరుగుతుందన్నారు. దేవరాపల్లి మండలం ఏపీ రెసిడెన్షియల్ స్కూల్లో తొమ్మిదో తరగతి చదువుతున్న సాగర్ మండపేటలో శిక్షణ తీసుకుంటున్నట్టు తెలిపారు.

సమ్మోహనం కూచిపూడి నృత్య విన్యాసం

120 మందితో కూచిపూడి నృత్యం



మద్దిలపాలెం (విశాఖ): కళాభారతి ఆడిటోరియంలో ఆదివారం నగరానికి చెందిన సిద్ధేంద్రయోగి కళానిలయం గురు సత్యభాను నృత్య కళాశాల 32వ వార్షికోత్సవం వైభవంగా జరిగింది. ఈ వేడుకలో కూచిపూడి నృత్య విన్యాసం సమ్మోహన భరితంగా సాగింది. కళానిలయం వ్యవస్థాపకురాలు సత్యభాను ఆధ్వర్యంలో 120 మంది నృత్య కళాకారులు తమ ప్రతిభను ప్రదర్శించారు. ముఖ్య అతిథిగా పాల్గొన్న సెంచూరియన్ యూనివర్సిటీ చాన్సలర్ ఆచార్య జి.ఎస్.ఎన్. రాజు మాట్లాడుతూ... ప్రతి విద్యార్థి విద్యతో పాటు సంప్రదాయ కళలను నేర్చుకోవాల్సిన ఆవశ్యకత ఉందని తెలిపారు. లెండి ఇంజినీరింగ్ కాలేజీ చైర్మన్ పి. మధుసూదన రావు మాట్లాడుతూ... కేంద్ర ప్రభుత్వం కళాశాలల్లో శాస్త్రీయ కళల గురువులను నామినేట్ చేసేందుకు ఇటీవల జీవో కూడా విడుదల చేసిందని, ఇది విద్యార్థులకు సంప్రదాయ నృత్యాలు అభ్యసించడానికి వీలు కల్పిస్తుందని చెప్పారు. కార్యక్రమంలో డా. శ్రీధర్ మిత్ర, కన్నం నాయుడు, కూచిపూడి కళాక్షేత్ర ప్రిన్సిపల్ గురు హరి రామమూర్తి, గోపీనాథ్ తదితరులు పాల్గొన్నారు.

ఎంటీఎస్ ఉపాధ్యాయులను రెగ్యులర్ చేయాలి



అనకాపల్లి: ఎంటీఎస్ ఉపాధ్యాయులకు ప్రభుత్వం ఉద్యోగ భద్రత కల్పించి, వారి కుటుంబాలను ఆర్థికంగా ఆదుకోవాలని ఉమ్మడి విశాఖ జిల్లాల ఎంటీఎస్ ఉపాధ్యాయుల సంఘం నాయకులు పి.శ్రీనివాసరావు, వి.ఈశ్వరరావు, డి.అప్పలనాయుడు అన్నారు. స్థానిక శారదానది ఒడ్డున శాంతిపార్కులో ఆదివారం ఉమ్మడి విశాఖ జిల్లాలో విధులు నిర్వహిస్తున్న ఉపాధ్యాయుల ఉద్యోగుల సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ 1998లో డీఎస్సీ పరీక్ష రాసి ఉద్యోగానికి ఉత్తీర్ణత సాధించగా, వైఎస్సార్‌సీపీ పాలనలో అప్పటి ముఖ్యమంత్రి వై.ఎస్.జగన్‌మోహన్‌రెడ్డి ఉద్యోగులకు మినిమం టైమ్ స్కేల్, కాంట్రాక్ట్ పద్ధతిలో ఉద్యోగాలు ఇవ్వడం జరిగిందన్నారు. కూటమి ప్రభుత్వంలో సీఎం చంద్రబాబునాయుడు ఎంటీఎస్ ఉద్యోగులను రెగ్యులర్ చేసి, తమని రెగ్యులర్ ఉపాధ్యాయుల మాదిరిగానే జీతాలు ఇచ్చి 62 సంవత్సరాలు సర్వీస్ పెంచాలన్నారు. 12 నెలలు ఉద్యోగం ఉండేలా చర్యలు తీసుకోవాలని, ఏజెన్సీ మారుమూల ప్రాంతానికి 150 కిలోమీటర్లు దూరం వెళ్లి ఉద్యోగాలు అనారోగ్యాలతో చేస్తున్నట్టు వారు పేర్కొన్నారు. రెండేళ్ల కాలంలో చాలా మంది ఉద్యోగులు రిటైర్ అయ్యారని, పదవీ విరమణ అనతరం తమకు ఆర్థిక సౌలభ్యం లేదన్నారు. ఈ కార్యక్రమంలో ఎంటీఎస్ ఉద్యోగులు సీతయ్యదొర, నాగేశ్వరరావు, నాగరాజు, రమణ, కనకరాజు, మంగపతి, మేరీ పాల్గొన్నారు.

సీటు దొరికేదెలా?..

కిటకిటలాడుతున్న రైళ్లు.. జనసంద్రంగా విశాఖ స్టేషన్









తాటిచెట్లపాలెం(విశాఖ): దసరా పండుగ సందర్భంగా విశాఖపట్నం నుంచి తమ సొంతూళ్లకు వెళ్లే ప్రయాణికులతో రైళ్లు కిక్కిరిసిపోతున్నాయి. ఉద్యోగులు, విద్యార్థులు, కార్మికులు తమ కుటుంబ సభ్యులతో కలిసి పండగ జరుపుకోవడానికి సొంత ప్రాంతాలకు బయలుదేరారు. దీంతో రెండు రోజులుగా విశాఖపట్నం రైల్వే స్టేషన్‌లో తీవ్ర రద్దీ నెలకొంది. విశాఖ నుంచి విజయవాడ, హైదరాబాద్, తిరుపతి, చెన్నై, బెంగళూరు వంటి ప్రధాన నగరాలతో పాటు, ఉత్తరాంధ్రలోని శ్రీకాకుళం, విజయనగరం, పలాస వైపు వెళ్లే రైళ్లు ప్రయాణికులతో నిండిపోతున్నాయి. దాదాపు అన్ని రైళ్లలో రిజర్వేషన్లు ముందే పూర్తికావడంతో, చివరి నిమిషంలో ప్రయాణాలు పెట్టుకున్న వారు తీవ్ర ఇబ్బందులు పడుతున్నారు. చాలా రైళ్లలో వెయిటింగ్ లిస్ట్ వందల్లో ఉండటంతో, టికెట్లు కన్ఫర్మ్ కాని ప్రయాణికులు జనరల్ బోగీలను ఆశ్రయిస్తున్నారు. దీంతో జనరల్ బోగీల్లో కాలు మోపడానికి కూడా స్థలం లేని పరిస్థితి నెలకొంది. ప్రయాణికులు గంటల తరబడి నిలబడే ప్రయాణం చేయాల్సి వస్తోంది. ముఖ్యంగా మహిళలు, వృద్ధులు, పిల్లలు తీవ్ర అవస్థలు పడుతున్నారు. రద్దీని దృష్టిలో ఉంచుకుని రైల్వే శాఖ కొన్ని ప్రత్యేక రైళ్లు ప్రకటించినప్పటికీ, అవి ఏమాత్రం సరిపోవడం లేదని ప్రయాణికులు వాపోతున్నారు. ప్రయాణికుల డిమాండ్‌కు అనుగుణంగా మరిన్ని ప్రత్యేక రైళ్లు నడపాలని, ఉన్న రైళ్లకే అదనపు బోగీలు ఏర్పాటు చేయాలని వారు కోరుతున్నారు.

రాష్ట్రంలో రెడ్ బుక్ రాజ్యాంగం



క్యూఆర్ కోడ్ పోస్టర్‌ను ఆవిష్కరిస్తున్న ఖాదర్ బాషా, బర్కత్ అలీ, ఫరూఖీ

మద్దిలపాలెం (విశాఖ): రాష్ట్రంలో రెడ్ బుక్ రాజ్యాంగం పాలన నడుస్తోందని, దీని వల్ల ప్రజలు, పలు శాఖల అధికారులు ఇబ్బందులు పడుతున్నారని మాజీ వక్ఫ్ బోర్డు చైర్మన్, వైఎస్సార్‌సీపీ రాష్ట్ర మైనారిటీ సెల్ అధ్యక్షుడు ఖాదర్ బాషా అన్నారు. జీవీఎంసీ 53వ వార్డు వైఎస్సార్ సీపీ కార్యాలయంలో కార్పొరేటర్ బర్కత్ అలీ, పలు ముస్లిం సంఘాల ప్రతినిధులతో కలిసి ఆయన రౌండ్ టేబుల్ సమావేశంలో పాల్గొన్నారు. రెడ్ బుక్ పాలన నుంచి విముక్తి కోసం మాజీ ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి క్యూఆర్ కోడ్‌ను అందుబాటులోకి తీసుకువచ్చారని తెలిపారు. ప్రజలు ఎదుర్కొంటున్న సమస్యలను క్యూఆర్ కోడ్ డిజిటల్ బుక్‌లో నమోదు చేయాలని సూచించారు. రానున్న రోజుల్లో వైఎస్సార్ సీపీ అధికారంలోకి వచ్చిన తర్వాత, ఆయా సమస్యలు తక్కువ వ్యవధిలో పరిష్కరిస్తామన్నారు. ప్రజలను ఇబ్బంది పెట్టిన అధికారులు, నాయకులపై చర్యలు తప్పవన్నారు. కార్యక్రమంలో ఐహెచ్ ఫారూఖీ, పలువురు ముస్లిం మైనారిటీ నాయకులు పాల్గొన్నారు.

క్లుప్తంగా

నేడు వైఎస్సార్‌సీపీ సమావేశం

అనకాపల్లి: జీవీఎంసీ పరిధిలో ఎటువంటి ముందస్తు సమాచారం లేకుండా చిరువ్యాపారుల బడ్డీలు, తోపుడుబళ్ల తొలగింపుపై స్థానిక రింగ్‌రోడ్డులోని వైఎస్సార్‌సీపీ కార్యాలయంలో సోమవారం ఉదయం 11 గంటలకు సమావేశం నిర్వహిస్తున్నట్టు ఆ పార్టీ పట్టణ అధ్యక్షుడు మందపాటి జానకీరామరాజు తెలిపారు. ఈ సమావేశానికి ముఖ్య అతిథిగా పార్టీ నియోజకవర్గ సమన్వయకర్త మలసాల భరత్ కుమార్ విచ్చేస్తారన్నారు. జోనల్ పరిధిలో ఎటువంటి ముందస్తు సమాచారం లేకుండా రహదారులపై బడ్డీలను తొలగించడం వల్ల చిరు వ్యాపారుల జీవనోపాధికి సరైన ప్రత్యామ్నాయ ఏర్పాట్లు చేయాలని తదితర అంశాలపై సమావేశం నిర్వహిస్తున్నట్లు పేర్కొన్నారు.

గుండె పనితీరుపై అవగాహన నేడు

అనకాపల్లి టౌన్: ప్రపంచ హృదయ దినోత్సవం సందర్భంగా స్థానిక ఎన్టీఆర్ మార్కెట్ యార్డు ఆవరణలో సోమవారం ఉదయం 6.30 గంటలకు గుండె పనితీరుపై తీసుకోవలిసిన జాగ్రత్తలపై అవగాహన కార్యక్రమం నిర్వహిస్తున్నట్లు వాకర్స్ క్లబ్ పట్టణ అధ్యక్ష, కార్యదర్శులు రాపేటి నారాయణరావు, కె.వి.వి సత్యనారాయణ తెలిపారు. ఈ కార్యక్రమంలో డాక్టర్ డి.డి. నాయుడు ఉపన్యసిస్తారని పేర్కొన్నారు.

సమాజాన్ని ప్రభావితం చేసిన కవి జాషువా


మాట్లాడుతున్న బీజేపీ జిల్లా అధ్యక్షుడు ద్వారపూడి పరమేశ్వరరావు

అనకాపల్లి టౌన్: సమాజాన్ని ప్రభావాన్ని చేసిన కవుల్లో గుర్రం జాషువా అగ్రగణ్యులని బీజేపీ జిల్లా అధ్యక్షుడు ద్వారపూడి పరమేశ్వరరావు తెలిపారు. ఆదివారం రాత్రి పట్టణంలోని ప్రైవేటు ఫంక్షన్ హాల్‌లో కవి కోకిల గుర్రం జాషువా జయంతోత్సవం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ తెలుగు కవిగా జాషువా అందించిన సేవలు వెలకట్టలేనివన్నారు. కార్యక్రమంలో బీజేపీ రాష్ట్ర నాయకులు కె.ఎస్.పి. చక్రవర్తి, బి.వి.కె. కాలేజీ లెక్చరర్ ఎం. మోహన్‌రావు, పొనగంటి అప్పారావు, రవిరాజ్ తదితరులు పాల్గొన్నారు.

ఏటా స్కాలర్‌షిప్ ఇవ్వడం అభినందనీయం


విద్యార్థులతో ఎమ్మెల్యే రామకృష్ణ, గౌరీ సేవా సంఘం కమిటీ సభ్యులు

అనకాపల్లి: ప్రతి విద్యార్థి కష్టపడి కాకుండా ఇష్టపడి చదువుకోవాలని ఎమ్మెల్యే కొణతాల రామకృష్ణ పేర్కొన్నారు. స్థానిక గవరపాలెం నిదానందొడ్డిలోని కల్యాణ మండపంలో గౌరీ సేవా సంఘం ఆధ్వర్యంలో గవర, ఇతర కులాలకు చెందిన 187 మంది విద్యార్థులకు ఆయన ఆదివారం స్కాలర్‌షిప్ పంపిణీ చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ అన్ని దానాల కంటే విద్యా దానం ఎంతో గొప్పదన్నారు. గౌరీ సేవా సంఘం ఆధ్వర్యంలో 13 సంవత్సరాలుగా పాలిటెక్నిక్, ట్రిపుల్ ఐటీ, ఇంజనీరింగ్, ఎంబీబీఎస్, ఎన్ఎఫ్‌టీ విద్యార్థులకు స్కాలర్ షిప్ ఇవ్వడం అభినందనీయమన్నారు. ఈ ఏడాది 187 మంది విద్యార్థులకు రూ.10 లక్షలు ఇచ్చారన్నారు. కార్యక్రమంలో వర్తకం సంఘం కార్యదర్శి కొణతాల లక్ష్మీనారాయణ(పెదబాబు), గౌరీ సేవా సంఘం అధ్యక్షుడు కర్రి సన్యాసినాయుడు, కార్యదర్శి బొడ్డేడ రామ సత్యనారాయణ, కోశాధికారి శరగడం జగదీష్, ఉపాధ్యక్షుడు ఆళ్ల మహాలక్ష్మినాయుడు, ఉపాధ్యాయులు కొణతాల రాజేంద్ర ప్రసాద్, కేవీఎస్ సత్యనారాయణ పాల్గొన్నారు.

అనకాపల్లి సినిమాలు

రాజా	:ఓజీ
సత్యనారాయణ స్క్రీన్-1	:కిష్కింధపురి
సత్యనారాయణ స్క్రీన్-2	: టన్నెల్
పర్తిసాయి	: ఓజీ
షిర్డీసాయి	: ఓజీ
వెంకటేశ్వర	: లిటిల్ హార్ట్స్
రామచంద్ర	: మిరాయ్

రక్త నిల్వలు

అనకాపల్లి: ఎన్టీఆర్ వైద్యాలయ రక్తనిధి కేంద్రంలో 76 యూనిట్ల రక్త నిల్వ ఉంది. ఏ పాజిటివ్-18, బీ పాజిటివ్-20, ఓ పాజిటివ్-32, ఏబీ పాజిటివ్-6 యూనిట్లు శుద్ధి చేసిన రక్తం నిల్వ ఉంది. అవసరమైన వారు వైద్యాలయం బ్లడ్‌బ్యాంక్ టెక్నీషియన్ యూ లోకేష్ (9703613706)ను సంప్రదించవచ్చు.

గ్యాస్ సమాచారం

అనకాపల్లి: ఇండేన్ గ్యాస్ ఏజెన్సీ ద్వారా ఆదివారం 253 మంది గ్యాస్ బుక్ చేసుకున్నారు. గతంలో బుక్ చేసుకున్న వారిలో 209 మందికి సిలిండర్లు సరఫరా చేశారు. వివరాలకు ఇండేన్ గ్యాస్ ఏజెన్సీ ప్రతినిధి (08924-223595)ని సంప్రదించవచ్చు.

చివరికి పైరు కళ

పెరిగిన ఖరీఫ్ సాగు విస్తీర్ణం
చెరకుకు ప్రభుత్వ ప్రోత్సాహం కరువు
ప్రత్యామ్నాయంగా వరి వంటపై మొగ్గు

కశింకోట: వర్షాలు ఆలస్యమైనా ఖరీఫ్ వరినాట్లు లక్ష్యానికి మించి పడ్డాయి. చెరకు పంటకు కూటమి ప్రభుత్వం సరైన ప్రోత్సాహం ఇవ్వకపోవడంతో ప్రత్యామ్నాయ సాగుగా వరి పంటపై ఈ ఏడాది రైతులు మొగ్గు చూపారు. దాంతో మండలంలో సాధారణ విస్తీర్ణాన్ని మించి నాట్లు పడ్డాయి. ఇప్పటికి 1,114 హెక్టార్లలో నాట్లు వేశారు. సాధారణ విస్తీర్ణానికి అదనంగా 166 హెక్టార్లలో నాట్లు వేశారు. ఇంకా ఖరీఫ్ ముగియడానికి ఈ నెలాఖరు (రెండు రోజులు) వరకు గడువు ఉండటంతో విస్తీర్ణం మరింత పెరగగలదని అధికారులు భావిస్తున్నారు.


ఎదుగుదల దశలో వరి

మండలంలో అత్యధికంగా ఖరీఫ్ వరి పండిస్తారు. ఈ ఏడాది వరి సాధారణ విస్తీర్ణం 1048 హెక్టార్లుగా అధికారులు నిర్ణయించారు. జూలైలో నాట్లు వేయడం ప్రారంభించారు. మొదట్లో వర్షాలు మందగించినప్పటికి ఆ తర్వాత వచ్చిన తుపాను వర్షాలు, అడపాదడపా పడిన వర్షాలు ఆదుకున్నాయి. దీంతో మొదట్లో 5 శాతం కూడా పడని నాట్లతో ఈ ఏడాది సాధారణ విస్తీర్ణానికి నాట్లు పడతాయా? లేదా? అని రైతులు ఒకింత దిగులు చెందారు. ఈ నేపథ్యంలో ఆగస్టు నెలలోను, ఈ నెలలోను కాస్త వాతావరణం అనుకూలించింది. అవసరమైన వర్షాలు కురవడం, శారదా నదిలో నీటిమట్టం పెరిగి ప్రవహించి గ్రోయిన్ల ద్వారా నది పరివాహక ప్రాంతాల్లోని భూములకు సాగు నీరు అందడం, బయ్యవరం, చింతలపాలెం, తీడ, చెరకాం, అడ్డాం తదితర గ్రామాల్లోని సాగునీటి చెరువుల్లో నీరు చేరడం, జమాదులపాలెం వద్ద రంగబోలు గెడ్డ జలాశయం వర్షాలు నిండి సాగు నీరు రావడంతో ఆయకట్టు భూముల్లో ఆగస్టు, సెప్టెంబర్ నెలల్లో వరి నాట్లు వేశారు.

ఈ గ్రామాల్లో వరి సాగు ఎక్కువ...

కశింకోట, వెదురుపర్తి, బయ్యవరం, తేగాడ, కొత్తపల్లి, బుచ్చియ్యపేట, పేరంటాలపాలెం, జమాదులపాలెం, విసన్నపేట, పరవాడపాలెం, ఉగ్గినపాలెం, తాళ్లపాలెం, జి. భీమవరం, అచ్చెర్ల, మోసయ్యపేట, సింగవరం, సుందరయ్యపేట, అడ్డాం, కన్నూరుపాలెం, తీడ, చెరకాం, ఏఎస్ పేట, సోమవరం గొబ్బూరు, నరసింగబిల్లి, చింతలపాలెం, నూతలగుంటపాలెం, అచ్యుతాపురం, ఏనుగుతుని తదితర గ్రామాల్లో ఖరీఫ్ వరి ఎక్కువగా పండిస్తారు. ఆయా గ్రామాల్లో నాట్లు వేశారు. వాతావరణం అనుకూలించడంతో ఈ ఏడాది ఇప్పటికి 1114 హెక్టార్లలో నాట్లు వేసినట్లు సమాచారం. ఇది సాధారణ విస్తీర్ణంతో పోల్చుకుంటే 166 హెక్టార్లు ఎక్కువ. ఇంకా ఆయా గ్రామాల్లో అక్కడక్కడ ఇంకా నాట్లు వేస్తున్నారు. ప్రభుత్వం నిర్దేశించిన మేరకు ఈ నెలాఖరుకు నాట్లు వేయడానికి గడువు ఉంది. కొందరు ఆ తర్వాత కూడా భూమి ఖాళీగా ఉంచలేక, వరి నారు ఎదగక వేయకుండా ఉన్న భూముల్లో నాట్లు వేస్తారు. దీంతో విస్తీర్ణం మరింతగా పెరగనుందని అధికారులు భావిస్తున్నారు. నీటి సదుపాయం ఉండి ముందుగా నాట్లు వేసిన ప్రాంతాల్లో ప్రస్తుతం వరి పొలాలు ఎదుగుదల దశలో ఉన్నాయి. వాటిలో వచ్చిన కలుపు తీసే పనిలో రైతులు కొందరు నిమగ్నమై ఉన్నారు. ప్రస్తుతానికి వాతావరణం అనుకూలంగా ఉండటంతో, మున్ముందు కూడా వర్షాలు సమృద్ధిగా పడితే ఈ ఏడాది వరి పండి తమ కష్టాలు గట్టెక్కగలవని రైతులు ఆశిస్తున్నారు.


కశింకోట వద్ద ఖరీఫ్ వరి సాగు

> **సాగు విస్తీర్ణం పెరగనుంది**
>
> మండలంలో ఈ ఏడాది ఖరీఫ్ వరి సాగు ఆశాజనకంగా ఉంది. సాధారణ విస్తీర్ణాన్ని మించి నాట్లు వేశారు. 1,048 హెక్టార్లు సాధారణ విస్తీర్ణం కాగా, అంతకు మించి 1,100 హెక్టార్లలో నాట్లు పడ్డాయి. ఇంకా ఈ నెలాఖరు వరకు గడువు ఉండటం వల్ల ఇంకా విస్తీర్ణం పెరగనుంది.
>
> -ఎం. స్వప్న, మండల వ్యవసాయ అధికారి, కశింకోట

పూర్వ విద్యార్థుల సందడి


అధ్యాపకులను సత్కరిస్తున్న పూర్వ విద్యార్థులు

అనకాపల్లి టౌన్: ఏరా.. ఎలా ఉన్నావు? ఏమి చేస్తున్నావు.. అంటూ ఆత్మీయ పలకరింపులతో పూర్వ విద్యార్థులంతా సందడి చేశారు. కొత్తూరు ఏఎంఏఎల్ కళాశాల వేదిగా ఆదివారం కలుసుకున్న వీరంతా ఆనాటి మధుర జ్ఞాపకాలను నెమరువేసుకున్నారు. ఇక్కడ 1996-99 సంవత్సరంలో చదివిన డిగ్రీ బ్యాచ్ విద్యార్థుల సమావేశం ఆదివారం సందడిగా జరిగింది. 25 సంవత్సరాల తర్వాత కలుసుకుని తమకు విద్యను బోధించిన అధ్యాపకులను ఆహ్వానించి పుష్పగుచ్ఛాలు అందజేసి, శాలువాలతో సత్కరించుకున్నారు. ఈ సందర్భంగా పదవీ విరమణ చేసిన అధ్యాపకులు పప్పల ఆదినారాయణ, మారేశ్వరరావు, అశోక్ కుమార్, నాగేశ్వరరావు మాట్లాడుతూ ప్రాథమిక స్థాయి నుంచి నైతిక విలువలు బోధించాలన్నారు. ప్రస్తుత సమాజంలో స్పీడ్ విద్యా విధానం పెరగడం వల్ల విద్యార్థుల్లో క్రమశిక్షణ, సమాజం పట్ల బాధ్యత, నైతిక విలువలు లోపిస్తున్నాయని ఆవేదన వ్యక్తం చేశారు. నేటి విద్యార్థులకు దేశభక్తి, నైతిక విలువలు, సమాజం పట్ల బాధ్యత తెలియజేయాలన్నారు. కార్యక్రమంలో గొంప వెంకట్, బోయిన చిన్నారావు, నరసింహమూర్తి, సింహాద్రి, గోపి, పూర్ణచంద్రరావు పాల్గొన్నారు.

5న దసరా ఉత్సవ మహాసభ

కశింకోట: మండలంలోని నరసింగబిల్లిలో వచ్చే నెల 5న దసరా ఉత్సవ మహాసభను నిర్వహించాలని ఆర్ఎస్ఎస్ ప్రతినిధులు నిర్ణయించారు. రాష్ట్రీయ స్వయం సేవక్ సంఘ్ (ఆర్ఎస్ఎస్) ఏర్పడి వందేళ్లు పూర్తయిన సందర్భంగా ప్రతినిధులు ఆదివారం గ్రామ పెద్దలను కలిసి ఆహ్వాన పత్రాలు అందజేశారు. కార్యక్రమంలో ఆర్ఎస్ఎస్ ప్రతినిధులు రామకోటి పరమేశు, చిరంజీవి రాజు, జెర్రిపోతుల నూకినాయుడు, కోన లక్ష్మి, గేదెల శేషుబాబు, గేదెల నానాజీ, కోన రవీంద్రనాయుడు, మారిశెట్టి లక్ష్మి తదితరులు పాల్గొన్నారు.

భగత్‌సింగ్ ఆశయ సాధనకు కృషి


భగత్ సింగ్ చిత్రపటానికి పూలమాల వేసి నివాళులర్పించిన రాజాన దొరబాబు

అనకాపల్లి: స్వాతంత్ర్య సమరయోధుడు భగత్‌సింగ్ ఆశయ సాధనకు నేటి యువత కృషి చేయాలని ఏఐటీయూసీ జిల్లా ప్రధాన కార్యదర్శి రాజాన దొరబాబు కోరారు. ఆదివారం స్థానిక ఏఐటీయూసీ కార్యాలయంలో భగత్‌సింగ్ 118 జయంతిని పురస్కరించుకుని ఆయన చిత్రపటానికి పూలమాలలు వేసి నివాళులర్పించారు. ఈ సందర్భంగా దొరబాబు మాట్లాడుతూ 23 సంవత్సరాల వయస్సులో దేశం కోసం ప్రాణత్యాగం చేసిన మహనీయుడు భగత్‌సింగ్ అని కొనియాడారు. బ్రిటిష్ ప్రభుత్వానికి వ్యతిరేకంగా విప్లవ ఉద్యమం నడిపిన ధైర్యశాలి, సమసమాజ స్థాపన నా లక్ష్యం అని ప్రకటించిన మేధావి ఆయనకే దక్కిందన్నారు. నేటి పాలకులు అమలు చేస్తున్న కార్మిక, ప్రజా వ్యతిరేక విధానాలకు భగత్ సింగ్ స్ఫూర్తితో పోరాడాలని పిలుపునిచ్చారు. కార్యక్రమంలో అల్యూమినియం వర్కర్స్ యూనియన్ కార్యదర్శి బుద్ద భద్రారావు, సభ్యులు కొండూరు వీరాచారి, కె.శ్రీను, గిరి, శ్యామ్, విత్తనాల పోతురాజు, సూరిబాబు తదితరులు పాల్గొన్నారు.

శక్తిరూపిణి.. జగన్మాత


సంతకంపట్టు కనకదుర్గమ్మకు లలితా త్రిపుర సుందరీ దేవి అలంకరణ..


కన్యకాపరమేశ్వరికి భద్రకాళిదేవిగా అలంకరణ


వేల్పులవీధి కాశీవిశ్వేశ్వర స్వామి ఆలయంలో వ్యాఘ్ర వాహిని దేవిగా అలంకరణ

అనకాపల్లి: దేవీ శరన్నవరాత్రులు అంగరంగ వైభవంగా జరుగుతున్నాయి. ఇందులో భాగంగా ఏడో రోజు ఆదివారం దుర్గాదేవి అమ్మవారు పలు అవతారాల్లో భక్తులకు దర్శనమిచ్చారు. స్థానిక సతకంపట్టు కనకదుర్గమ్మ లలితా త్రిపుర సుందరీదేవి అలంకరణలో భక్తులకు దర్శనమిచ్చారు. అమ్మవారి ఉత్సవ విగ్రహాన్ని రథంపై పట్టణ పురవీధుల్లో ఊరేగించారు.

కామాక్షిదేవి ఆలయంలో...

స్థానిక నిదానందొడ్డి కామాక్షిదేవి ఆలయంలో అమ్మవారిని వ్యాఘ్ర వాహినిదేవిగా అలంకరించారు. స్వర్ణ హస్త కంకణం సన్మాన గ్రహీత డాక్టర్ సప్పిభారతి పోతులూరి వీరబ్రహ్మేంద్ర స్వామి జీవిత చరిత్ర హరికథా గానం నిర్వహించారు.

కన్యకాపరమేశ్వరి ఆలయంలో..

స్థానిక మెయిన్‌రోడ్డు కన్యకాపరమేశ్వరి ఆలయంలో అమ్మవారు భద్రకాళీదేవి అలంకరణలో భక్తులకు దర్శనమిచ్చారు. శ్రీకృష్ణ కళామందిర్ దివ్యసురేష్ శిష్య బృందం ప్రదర్శించిన భరత నాట్యం ఆహూతులను ఆకట్టుకుంది.

నూకాంబిక ఆలయంలో...

స్థానిక గవరపాలెం నూకాంబిక అమ్మవారి బాలాలయంలో అమ్మవారిని జేసీ జాహ్నవి, ఈపీడీసీఎల్ సీఎండీ పృథ్వీతేజ్ దంపతులు, ఎమ్మెల్యే కొణతాల రామకృష్ణ దర్శించుకుని ప్రత్యేక పూజలు చేశారు. 108 కలశాలకు ప్రత్యేక పూజలు, ఉత్సవ విగ్రహానికి పంచామృతాభిషేకాలు వంటి అనేక కార్యక్రమాలు చేశారు. మధ్యాహ్నం కడిమిశెట్టి వీరవెంకట సత్యనారాయణమూర్తి రాధా, అంగుళూరి కొండలరావు దంపతులు ఆర్థిక సహాయంతో భవానీ భక్తులకు అన్నసమారాధన ఏర్పాటు చేశారు.


కరెన్సీ అలంకరణలో కనకదుర్గమ్మ

మలసాల భరత్‌కుమార్ పూజలు

స్థానిక కోట్నివీధిలో వైఎస్సార్‌సీపీ 84వ వార్డు ఇన్‌చార్జి కోరుకొండ రాఘవ ఆధ్వర్యంలో ఏర్పాటు చేసిన పవర్ ఆఫ్ యూత్ కనకదుర్గమ్మను నియోజకవర్గ సమన్వయకర్త మలసాల భరత్‌కుమార్ దర్శించుకున్నారు. వైఎస్సార్‌సీపీ రాష్ట్ర కార్యదర్శి మలసాల కుమార్‌రాజా, పట్టణ అధ్యక్షుడు మందపాటి జానకీరామరాజు, నియోజకవర్గ యువజన విభాగం అధ్యక్షుడు జాజుల రమేష్, 80వ వార్డు ఇన్‌చార్జి కె.ఎం.నాయుడు, నాయకులు దాడి నారాయణరావు, మాదురి నాయుడు, మారిశెట్టి శ్రీనివాసరావు, డాక్టర్ సిద్ధార్థ, జాన్‌దీప్ పాల్గొన్నారు.

నర్సింగరావు పేటలో....

స్థానిక నర్సింగరావుపేటలో దుర్గాసాయి గణపతి దేవాలయం శ్రీశక్తి పీఠం 25వ వార్షికోత్సవం సందర్భంగా కనకదుర్గమ్మను 82వ వార్డు కార్పొరేట్ మందపాటి సునీత జానకీరామరాజు దర్శించుకుని ప్రత్యేక పూజలు చేశారు. కార్యక్రమంలో ఆలయ కమిటీ సభ్యులు తదితరులు పాల్గొన్నారు.


కామాక్షిదేవి ఆలయంలో హరికథా గానం


నూకాంబిక ఉత్సవ విగ్రహానికి క్షీరాభిషేకం చేస్తున్న ఎమ్మెల్యే కొణతాల


నూకాంబిక సేవలో జేసీ జాహ్నవి, ఈపీడీసీఎల్ సీఎండీ పృథ్వీతేజ్ దంపతులు


కన్యకాపరమేశ్వరి ఆలయంలో భరతనాట్యం


అన్నసమారాధన ప్రారంభిస్తున్న 82వ వార్డు కార్పొరేటర్ సునీత జానకీరామరాజు దంపతులు


నూకాంబిక ఆలయంలో 108 కలశాలతో పూజ


కోట్నివీధిలో కనకదుర్గమ్మను దర్శించుకున్న వైఎస్సార్‌సీపీ నియోజకవర్గ సమన్వయకర్త మలసాల భరత్‌కుమార్

శాస్త్రోక్తంగా చండీ హోమం


కశింకోట జాతీయ రహదారి వద్ద కనకదుర్గ ఆలయంలో చండీదేవిగా అమ్మవారు


కశింకోట శివాలయంలో నిర్వహిస్తున్న చండీదేవి హోమం

కశింకోట: దసరా ఉత్సవాల్లో భాగంగా కశింకోటలో ఏడో రోజు ఆదివారం స్థానిక శివాలయంలో చండీ హోమం నిర్వహించారు. దుర్గా సప్తశతి మంత్రోచ్చరణల నడుమ శాస్త్రోక్తంగా వేద పండితులు మూడు గంటలపాటు హోమం చేశారు. అర్చకుడు వి. చిదంబరం దంపతులు ఆధ్వర్యంలో జరిగిన కార్యక్రమంలో భవానీ మాలాధారణ భక్తులతో పాటు సాధారణ భక్తులు పాల్గొన్నారు. ఆలయంలో సర్వమంగళాంబను దుర్గాదేవి ఏడో అవతారం చండీదేవిగా వస్త్రాలు, ఆభరణాలు, కిరీటంతో అలంకరించి సహస్ర నామార్చనతో కుంకుమ పూజలు నిర్వహించారు. స్థానిక జాతీయ రహదారి వద్ద కనకదుర్గ ఆలయంలో దుర్గాదేవి అమ్మవారు చండీదేవి అలంకారంలో భక్తులకు దర్శనమిచ్చి కనువిందు చేశారు. అమ్మవారిని చండీదేవిగా అలంకరించి సమస్ర నామ కుంకుమార్చనలు నిర్వహించారు. జిల్లాలోని భవానీ భక్తులు ఎక్కువగా దర్శించారు. ఆలయ వ్యవస్థాపకుడు ఎన్. ప్రసాద్ బాబు ఆధ్వర్యంలో కార్యక్రమం జరిగింది. కశింకోటతోపాటు పలు గ్రామాల్లో దుర్గాదేవి విగ్రహాల వద్ద ప్రత్యేక పూజలు, భజనలు వంటి కార్యక్రమాలు నిర్వహించి ప్రసాద వితరణ చేశారు.


కశింకోట శివాలయంలో చండీదేవి అలంకారంలో సర్వమంగళాంబ

వృత్తి విద్యా కోర్సులతో భవిష్యత్‌కు పునాది


కశింకోటలో ఎలక్ట్రానిక్ దుకాణంలో విద్యార్థులకు అవగాహన


బ్యూటీ పార్లర్‌లో అందిస్తున్న సేవలపై విద్యార్థులకు కల్పిస్తున్న అవగాహన

కశింకోట: వృత్తి విద్యా కోర్సుల్లో విద్యార్థులు తమ భవిష్యత్‌కు పునాది వేసుకోవడానికి అవకాశం కలుగుతుందని హెచ్‌ఎం ఎంఎస్ స్వర్ణకుమారి తెలిపారు. స్థానిక బాలికల హైస్కూలుకు చెందిన 9, 10 తరగతుల విద్యార్థులు సమగ్ర శిక్ష ఆధ్వర్యంలో అభ్యసిస్తున్న ఎలక్ట్రానిక్, బ్యూటీ అండ్ వెల్‌నెస్ వృత్తి విద్యా కోర్సుల్లో భాగంగా దసరా సెలవుల్లో ఇంటర్న్‌షిప్ నిర్వహిస్తున్నారు. ఈ సందర్భంగా విద్యార్థులనుద్దేశించి ఆమె మాట్లాడుతూ ఇంటర్న్‌షిప్‌లో విద్యార్థులు వృత్తి నైపుణ్యాన్ని పెంపొందించుకోవడానికి అవకాశం కలుగుతుందన్నారు. స్థానిక ఎలక్ట్రానిక్ దుకాణాల్లో ఎలక్ట్రిక్ వస్తువులు, పరికరాల పనితీరు, బ్యూటీ పార్లర్‌లో అందించే సేవలపై విద్యార్థులకు అవగాహన కల్పిస్తున్నట్లు తెలిపారు. ఎలక్ట్రానిక్, బ్యూటీ అండ్ వెల్‌నెస్ ట్రైనర్లు బి. నిర్మల, కె. రజని కార్యక్రమంలో పాల్గొన్నారు.

నిరుద్యోగులకు స్టడీ మెటీరియల్ పంపిణీ

నాతవరం : ప్రభుత్వ ఉద్యోగాలు సాధించేందుకు కష్టపడి చదువుతున్న నిరుద్యోగ యువతకు స్టడీ మెటీరియల్‌తో పాటు అన్ని విధాలుగా ప్రోత్సాహం అందిస్తానని నాతవరం ఎస్ఐ వై.తారకేశ్వరరావు అన్నారు. పి.జగ్గంపేట గ్రామంలో జిల్లా ఎస్పీ తుహిన్ సిన్హా ఆదేశాల మేరకు సర్పంచ్ జివిరెడ్డి సోమన్నదొర ఆధ్వర్యంలో ఆదివారం ఫ్రెండ్లీ పోలీసింగ్‌పై అవగాహన సదస్సు నిర్వహించారు. ఈ సందర్భంగా ఎస్ఐ ప్రత్యేక శ్రద్ధతో మండలంలో పోటీ పరీక్షలకు సిద్ధపడుతున్న నిరుద్యోగులకు అవసరమైన స్టడీ మెటీరియల్‌ను దాతల సాయంతో ఏర్పాటు చేశారు. వాటిని మండల వ్యాప్తంగా పోటీ పరీక్షలకు సిద్ధపడుతున్న వారికి అందజేశారు. స్టడీ మెటీరియల్ అందించేందుకు పోలీసుస్టేషన్‌లో ప్రత్యేకంగా మొబైల్ లైబ్రరీకి ఇన్‌ఛార్జిగా ఒక కానిస్టేబుల్‌ను నియమించామని తెలిపారు. స్టడీ మెటీరియల్‌కు సంబంధించి ఆయనను 9966141347 నంబర్‌కు ఫోన్‌లో సంప్రదిస్తే ఏర్పాటు చేస్తానన్నారు.

ద్విచక్ర వాహనం చోరీపై ఫిర్యాదు

మునగపాక: మండలంలోని పల్లపు ఆనందపురంలో ద్విచక్ర వాహనం చోరీపై మునగపాక పోలీసులకు ఆదివారం బాధితుడు అరసవిల్లి కృష్ణ ఫిర్యాదు చేశాడు. పల్లపు ఆనందపురంలో నివాసం ఉంటున్న కృష్ణ శనివారం రాత్రి తన ద్విచక్ర వాహనాన్ని ఇంటి ఆవరణలో ఉంచాడు. ఆదివారం తెల్లవారు లేచి చూసేసరికి బైక్ కనిపించకపోవడంతో ఆందోళనకు గురైన ఆయన పోలీసులకు ఫిర్యాదు చేశాడు.

జీఎస్టీ తగ్గింపుతో లబ్ధి

అనకాపల్లి: కేంద్ర ప్రభుత్వం జీఎస్టీ తగ్గించడంతో పేద, మధ్య తరగతికి పెద్ద ఎత్తున లబ్ధి చేకూరుతుందని మాజీ ఎమ్మెల్యే పీలా గోవింద సత్యనారాయణ తెలిపారు. ఆదివారం స్థానిక క్యాంపు కార్యాలయలో మాట్లాడుతూ జీఎస్టీ తగ్గింపుతో తక్కువ ధరకే వివిధ రకాల వస్తువులు కొనుగోలు చేసుకోవచ్చని పేర్కొన్నారు.